నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు

నకరికల్లు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పనా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకంలో వంద పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబంలోని నిరుద్యోగులకు ఉచిత భోజనం, ఉచిత హాస్టల్ వసతితో కూడిన శిక్షణనిచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు జాబ్స్ రిసోర్స్ పర్సన్ వై.శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. 2018 నుంచి 2023 వరకు వంద పనిదినాలు పూర్తిచేసుకున్న కుటుంబంలో సభ్యులు పదో తరగతి పాసై ఉండి ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ పాస్ లేదా ఫెయిల్ అయి 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు ఉన్నవారు అర్హులన్నారు. రూ.15 వేలు నుంచి రూ.25వేల వేతనం, సంస్థ నిబంధనల ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో కామన్ సబ్జెక్ట్‌గా కంప్యూటర్ కోర్సు, కంప్యూటర్ టైపింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంటర్వ్యూ స్కిల్స్ అదనంగా నేర్పిస్తారని అన్నారు. శిక్షణ అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సర్టిఫికెట్ ఇస్తారన్నారు.

విత్తనాల కిట్లు, పరికరాలు సద్వినియోగం చేసుకోవాలి

సత్తెనపల్లి: ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న షెడ్యూల్డ్ కులాలకు చెందిన రైతులు ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలు కిట్లు, ఇతర పరికరాలు సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం గోరంట్ల గ్రామంలో ఎస్సీ రైతులకు ప్రకృతి వ్యవసాయం పై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు


విశేష అలంకరణలో నర్శింగపాడులోని అన్నపూర్ణాదేవి అమ్మవారు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య మహిళా విభాగం సభ్యులు

నకరికల్లు: శ్రావణ మాసం రెండో శుక్రవారం పురస్కరించుకొని వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు. మండలంలోని నర్శింగపాడులోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, మరకతలింగేశ్వరస్వామి ఆలయం, చేజర్లలోని శ్రీకపోతేశ్వరస్వామి ఆలయం, దేచవరం, గుండ్లపల్లి గ్రామాల్లోని మల్లేశ్వరస్వామి ఆలయం, చల్లగుండ్లలోని రామలింగేశ్వర స్వామి ఆలయం తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివార్లకు విశేష ద్రవ్యములతో అభిషేకాలు చేశారు. అమ్మవారిని, స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళా భక్తులు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని, స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట: శ్రావణమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని భక్తులు వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళా విభాగం సభ్యులు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, సామూహిక కుంకుమ పూజలు, 108 కలశాలతో గ్రామోత్సవం, గాయత్రి, వాసవి కన్యకాపరమేశ్వరి, లలిత అమ్మవార్ల సహస్ర అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. ఆలయ పూజారి సురేష్‌భట్టాచార్యులు వ్రతాలు నిర్వహించారు. స్థానిక హరిహర క్షేత్రంలోని గంగా, భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయాలలో అమ్మవారి వ్రతాలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు విశేషంగా తరలి వచ్చి అమ్మవారి వ్రత కార్యక్రమాలలో పాల్గొని భక్తి శ్రద్ధలతో తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సత్తెనపల్లిలో..

సత్తెనపల్లి: వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని అమ్మవారికి కుంకుమ పూజలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, శ్రీ త్రిశక్తి దుర్గాపీఠంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

పెదకూరపాడు మండలంలో..

పెదకూరపాడు: భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు మండల వ్యాప్తంగా దేవాలయాల్లో మహిళలు శుక్రవారం జరుపుకున్నారు. పెదకూరపాడులోని త్రిశక్తి పీఠంలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతం ఆచరించారు. కన్యకాంబ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కంభంపాడులో దుర్గాదేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా సమయంలో మార్పులు

నకరికల్లు: మండలంలోని నకరికల్లు, గుండ్లపల్లి, చల్లగుండ్ల, చేజర్ల గ్రామాల్లోని విద్యుత్‌సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సింగిల్‌ఫేజ్ సరఫరా మాత్రమే ఉంటుందని ఆ శాఖ డీఈఈ బి.వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. పిడుగురాళ్లలోని 220 కేవీ ఉపకేంద్రం మరమ్మతుల కారణంగా త్రీఫేజ్ సరఫరా ఉండదన్నారు. త్రీఫేజ్ సరఫరా శనివారం తెల్లవారుజామున 3గంటల నుంచి ఉదయం 8.30గంటల వరకు అలాగే మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సరఫరా ఉంటుందని చెప్పారు.

పేదల వైద్యానికి భరోసా

- ప్రభుత్వ వైద్యశాలలో అన్ని రకాల ఆపరేషన్లు
- త్వరలో ప్రారంభం కానున్న పోస్ట్ ఆపరేషన్ వార్డు
- ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ లక్ష్మణరావు



సత్తెనపల్లి: ప్రభుత్వం వైద్యశాలలో చిన్న చిన్న వ్యాధులకు అవసరమైన అన్ని రకాల ఆపరేషన్లు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ బి.లక్ష్మణరావు పేర్కొన్నారు. సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో కొత్తగా మొదలైన జనరల్ ఆపరేషన్స్‌పై శుక్రవారం వైద్యశాలలో సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ మంత్రి అంబటి రాంబాబు చొరవతో సేవలు విస్తృతం చేస్తున్నట్లు చెప్పారు. ఇంతకు ముందు కేవలం గర్భిణుల ఆపరేషన్లు మాత్రమే ఇక్కడ జరిగేవని ఇప్పుడు అన్ని రకాల ఆపరేషన్‌లు ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో చేస్తున్నట్లు వివరించారు. అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ అవసరం ఉన్న రోగులు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్యశాలలోని సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. ప్రైవేట్ వైద్యశాలలకు వేలకు వేలు అయ్యే ఖర్చు ఇక్కడ పూర్తి ఉచితంగానే చేస్తున్నారని దీనికి సంబంధించి పోస్ట్ ఆపరేషన్ ప్రత్యేక వార్డుని త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. జనరల్ సర్జన్ డాక్టర్ సుష్మ మాట్లాడుతూ ఈ నెల 28 ఆపరేషన్లు మన ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించామని, గత నెల 26 ఆపరేషన్లు చేశామని వెల్లడించారు. సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ ఇప్పుడు మనకి ఇద్దరు జనరల్ ఎండి సర్జన్స్ అందుబాటులో ఉన్నారని, కావాల్సిన సౌకర్యాలు కూడా అందిస్తున్నామన్నారు. వివిధ రుగ్మతలతో బాధపడే రోగులు ఈ అవకాశాన్ని అవసరం ఉన్నవారు ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు. సమావేశంలో అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సురేష్, ఏవో భవాని, ఆర్ఎంఓ శోభారాణి పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చనలు



అమరావతి: శ్రావణ మాసంలో శుక్రవారం స్థానిక అమరేశ్వరాలయంలో సామూహిక కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి వేమూరి గోపినాథశర్మ పర్యవేక్షణలో వెంకటాద్రినాయుడు మండపంలో స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో కుంకుమార్చనలు నిర్వహించారు.

జై గౌడ్ ఉద్యమం పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా రాము

సత్తెనపల్లి: జై గౌడ్ ఉద్యమం పల్నాడు జిల్లా నూతన అధ్యక్షుడిగా సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన గ్రామానికి చెందిన గాలి రాముగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబొమ్మ కిషోర్ గౌడ్ నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. ఈనెల 26న ఉదయం 10 గంటలకు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా లింగారెడ్డి


బాసు లింగారెడ్డి


షేక్ నాగుర్‌మీరాన్

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పారిశ్రామికవేత్త బాసు లింగారెడ్డి, జిల్లా కార్యదర్శిగా మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ నాగుర్‌మీరాన్ నియమితులయ్యారు. ఈ మేరకు 47 మందితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన నూతన కార్యవర్గంలో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి వీరికి స్థానం లభించింది. అలాగే ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా తోట మోహన్‌రావు, కనుమూరి లక్ష్మీ త్రివేణి, చట్టూ సైదారావు, గోపిదేశి బాజమ్మలను నియమించారు. తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

మినీలారీ ఢీకొని వృద్ధుడి మృతి

క్రోసూరు: మినీలారీ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ పాల్ రవీందర్ తెలిపిన వివరాలు.. మండలంలోని ఎర్రబాలేనికి చెందిన వృద్ధుడు వెలది నాగయ్య(62) టీ తాగేందుకు రోడ్డు దాటుతుండగా సత్తెనపల్లి నుంచి క్రోసూరు వస్తున్న మినీ లారీ ఢీకొట్టింది. తీవ్రగాయాలైన క్షతగాత్రుడిని గుంటూరు జీజీహెచ్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మండల్ చిరస్మరణీయుడు

సత్తెనపల్లి: దేశ స్వాతంత్ర చరిత్రలో బీసీల బతుకుల్లో నిజమైన వెలుగులు నింపిన కార్య దర్శకుడు బిందేశ్వరి ప్రసాద్ మండల్(బీపీ మండల్) అని బీసీ సంఘాల నాయకులు కొనియాడారు. పట్టణంలోని తాలూకా సెంటర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద బీసీ సంఘాల ఆధ్వర్యంలో మండల్ జయంతి సందర్భంగా బీపీ మండల్ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

క్రోసూరు: మండలంలోని పెరికపాడు గ్రామానికి చెందిన రైతు ఆవుల వెంకట్రావు(52) గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆస్పత్రి నుంచి మృతుడి కుమారుడు సాయికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పాల్ రవీందర్ తెలిపారు. వ్యవసాయంలో అప్పులు కావటంతో అప్పులు తీర్చేలేనన్న మనస్తాపంతో ఈనెల 14వ తేదీన పొలంలోనే పురుగుమందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. చుట్టుపక్కల రైతులు చూసుకుని చికిత్స కోసం సత్తెనపల్లి తరలించగా అక్కడి నుంచి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు.

మాజీ ప్రిన్సిపాల్ రంగనాథం..

అమరావతి: మండల పరిధిలోని ధరణికోట రాజావాసిరెడ్డి వెంకటాద్రినాయుడు డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ పెద్దింటి రంగనాథం(84) శుక్రవారం వేకువజామున మృతి చెందారు. కళాశాలలో 37 ఏళ్లపాటు వృక్ష శాస్త్రం బోధన చేసి కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. భౌతిక కాయాన్ని మండల పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ఆర్‌వీవీఎన్ కళాశాల అధ్యాపకులు సందర్శించి నివాళులర్పించారు.